సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 2 । జూన్ । 2024



పశు బీమా.. పాడి రైతుకు ధీమా

వైఎస్సార్ పశు బీమా పథకం ప్రభుత్వం పశు పోషకులకు అండగా నిలుస్తోంది. రైతు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే చాలు. మిగిలిన 80 శాతం ప్రభుత్వమే భరిస్తుంది. -8లో



అనంత, కర్నూలు జట్ల హోరాహోరీ

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.220	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 686 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు కొనుగోలు



కార్మికులకు చెక్కులు పంపిణీ చేస్తున్న పారిశ్రామికవేత్త గిరిధర్‌రెడ్డి

మదనపల్లె: నియోజకవర్గంలో ఘనచరిత్ర కలిగిన మదనపల్లె స్పిన్నింగ్ మిల్లును తిరుపతికి చెందిన పారిశ్రామికవేత్త గిరిధర్‌రెడ్డి ఆన్‌లైన్ వేలంలో రూ.39 కోట్లకు కొనుగోలు చేశారు. ఈక్రమంలో 308 మంది కార్మికులకు చెల్లించాల్సిన రూ.6.70 కోట్ల బకాయిల్లో రూ.4.51 కోట్లు కర్ణాటక లిక్విడేటర్ వద్ద డిపాజిట్ చేశారు. అందులో నుంచి రూ.2.91 కోట్లు శనివారం సీటీఎంలోని స్పిన్నింగ్ మిల్లు వద్ద చెక్కుల రూపంలో కార్మికులకు గిరిధర్‌రెడ్డి పంపిణీ చేశారు. దీంతో పాటు కార్మికులకు చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి రూ.1.10 కోట్లు విజయవాడ ఏఆర్సీ బ్యాంక్ లిక్విడేటర్ వద్ద డిపాజిట్ చేసినట్లు ఆయన తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతం



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 75001 నుంచి 92 వేల మధ్య ర్యాంకులు వచ్చిన 155 మంది విద్యార్థులు హాజరై తమకు సంబంధించిన ర్యాంకులు, సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఆదివారం 92001 నుంచి 108000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు, ర్యాంకులను పరిశీలన చేయనున్నట్లు కో ఆర్డినేటర్ తెలిపారు.

వేరుశనగల పంపిణీ తనిఖీ




వేరుశనగ విత్తనకాయల పంపిణీని తనిఖీ చేస్తున్న జేడీ చంద్రనాయక్

సుండుపల్లె: సంబేపల్లె మండలంలోని సుండుపల్లె-2 రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని జేడీ చంద్రనాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తన కాయలు తీసుకున్న ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది వేరుశనగ విత్తనాల నాణ్యతను పరిశీలించి బాగుంటేనే దించుకోవాలని, లేని పక్షంలో వెనక్కు పంపాలని సూచించారు. అధికారులు ఎటువంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ రమేష్ రాజు, వ్యవసాయ అధికారి ఎస్.మహబూబ్ బాషా, ఆర్‌బీకే సిబ్బంది మల్లికార్జున పాల్గొన్నారు.

కుట్రలు.. కుతంత్రాలు

- పోలింగ్ ముగిసినా కొనసాగిస్తున్న ఎల్లోబ్యాచ్
- బీటెక్ రవితో రహస్య ఒప్పందాలంటూ వండి వార్చిన ఎల్లోమీడియా
- వైఎస్సార్‌సీపీ నేతల మధ్య కలతలు..విభేదాలు సృష్టించే ఎత్తుగడ
- కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి విజయం తథ్యం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఓట్ల కంటే ఎంపీ అభ్యర్థికి తగ్గనున్న ఓట్లు



సాక్షి ప్రతినిధి, కడప: పోలింగ్ ముగిసింది. ప్రజా తీర్పు నిక్షిప్తమై ఉంది. జనం తుది ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. కౌంటింగ్ చేపట్టడమే తరువాయి. అయినా ఇప్పటికీ ఎల్లోబ్యాచ్ కుట్రలు, కుతంత్రాలను వీడడం లేదు. కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది.. కాబట్టే పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవితో రహస్య ఒప్పందాలు చేపట్టారని తోకపత్రిక వండివార్చింది. హవ్వా..నవ్విపోదురుగాక, నాకేటి సిగ్గు అన్నట్లుగా వ్యవహారం ఉండిపోయింది. టీడీపీ ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని ఎంపిక చేసి బలిపీఠం ఎక్కించారు. భూపేష్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేయక పోగా, ఎదుటిపార్టీపై బురద చల్లి అంతర్గత కలతలు, విభేదాలు సృష్టించే ఎత్తుగడను ఎంచుకున్నారు.

- తెలుగుదేశం పార్టీ జమ్మలమడుగు ఇన్‌చార్జిగా భూపేష్‌రెడ్డి జనం మధ్యకు వెళ్లారు. నిత్యం జనంతోనే ఉంటూ తన పరపతి పెంచుకున్నారు. టీడీపీ అభ్యర్థిత్వం ఖరారు అవుతుందనుకున్న తరుణంలో అనూహ్యంగా ఆదినారాయణరెడ్డి తెరపైకి వచ్చి, ఎన్నికల పొత్తులో భాగంగా ఆ స్థానాన్ని బీజేపీకి కేటాయించేలా చక్రం తిప్పారు. భూపేష్ ఆశలు అడియాశలయ్యాయి. జమ్మలమడుగులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. కుటుంబ సభ్యులు మద్దతుగా నిలిచారు. ఆ నిర్ణయం ఆదినారాయణరెడ్డి నోట్లో వెలక్కాయపడ్డట్లయింది. భూపేష్ మద్దతు లేకపోతే, జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థిగా రాజకీయ మనుగడ సాధించలేననే నిర్ణయానికి వచ్చారు. జిల్లా నేతల ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చారు. పార్లమెంట్ అభ్యర్థిత్వం ఖరారయ్యే వరకు జమ్మలమడుగు గడ్డపై అడుగు పెట్టలేదు. ఈపరిణామం మొత్తం జిల్లా వాసులకు ఎరుకే.

లోపాయికారి ఒప్పందం టీడీపీదే....

కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కంటే ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు అధికంగా వస్తున్న నియోజకవర్గాల్లో మొదటిది పులివెందులే. బీటెక్ రవికి పడిన ప్రతి ఓటు అక్కడ టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌కు పడాలి. ఎందుకంటే అవన్నీ టీడీపీ సంప్రదాయ ఓట్లు కాబట్టి. స్వయంగా బీటెక్ రవికి పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో ఉన్న రహస్య ఒప్పందం మేరకు ఎంపీ అభ్యర్థి భూపేష్‌కు అక్కడ గండికొట్టారు. క్రాస్ ఓటింగ్ చేయించారు. కాంగ్రెస్‌తో లోపాయకారి ఒప్పందం చేసుకున్న టీడీపీ నేతలే, ఎదుటివాళ్లపై బురద వేసేందుకు ఎల్లోబ్యాచ్‌తో తప్పుడు రాతలు రాయించే పనిలో నిమగ్నమయ్యారని పలువురు వివరిస్తున్నారు.

హవ్వా...ఓటమి భయమా..?!

కడప ఎంపీగా ఇప్పటికీ రెండు పర్యాయాలు వైఎస్ అవినాష్‌రెడ్డి విజయం సాధించారు. తొలుత 1.90 లక్షల పైచిలుకు ఓట్లతో విజయం సాధించగా, రెండో మారు 3.80లక్షల ఓట్ల మెజార్టీ సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం మరో పర్యాయం తలపడ్డారు. ఈ సారి కూడా ఆంధ్రప్రదేశ్‌లో భారీ మెజార్టీ సాధించే వారిలో వైఎస్ అవినాష్‌రెడ్డి ఉన్నట్లు విశ్లేషకులు వివరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఉంటే ఓటమి భయం పట్టుకున్నట్లు ఎల్లోమీడియా చెప్పుకు రావడం విశేషం. తగ్గట్లుగా కథనం వండివార్చి బీటెక్ రవితో రహస్య ఒప్పందమంటూ వైఎస్సార్‌సీపీలో అంతర్గత కలతలు రేపేందుకు సిద్ధమయ్యారని పలువురు వివరిస్తుండడం గమనార్హం.

తెరపైకి వచ్చిన తెలుగుకాంగ్రెస్

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తెరపైకి వచ్చారు. ప్రచారం ఆరంభం నుంచి షర్మిలతో టీడీపీ నేతలు జతకట్టారు. పరస్పర అవగాహనకు వచ్చారు. టీడీపీ అభ్యర్థులు పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌కు ఓటు అడగడం పూర్తిగా మానుకున్నారు. కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు మినహా తక్కిన టీడీపీ అభ్యర్థులు డమ్మీ బ్యాలెట్ కూడా చూపలేదు. వాస్తవంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కంటే ఎంపీ అభ్యర్థికి ఓట్లు గణనీయంగా తగ్గిపోతున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.



జమ్మలమడుగులో స్వతహా అనుబంధం ఉన్న నేపథ్యంలో అక్కడ ఎంపీ అభ్యర్థికి ఓట్లు సమానంగా వచ్చినా, తక్కిన ప్రాంతాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చే ఓట్ల కంటే తక్కువగా వచ్చే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. టీడీపీ నేతల శల్య సారథ్యం వల్ల కాంగ్రెస్ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ పడ్డట్లు తెలుస్తోంది. తెలుగు కాంగ్రెస్ చర్యల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలకు భారీగా ఓట్లు ఖాతాలోకి రానున్నాయి. 2019లో ఆ పార్టీ అభ్యర్థి గుండ్లకుంట శ్రీరాములుకు 8,341 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరగనుంది. అదేవిధంగా 2019 టీడీపీ అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డికి 4,02,773 ఓట్లు లభించాయి. ఆ ఓట్లు ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డికి రావడం లేదని విశ్లేషకులు వివరిస్తున్నారు. జూన్ 4న వెలువడే ఫలితాలు ఆ విషయాన్ని స్పష్టం చేయనున్నట్లు సమాచారం.

కౌంటింగ్‌లో ఫారం-17సీ ఎంతో కీలకం

కడప సెవెన్‌రోడ్స్: ఈనెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన ప్రతి కౌంటింగ్ ఏజెంట్ ఫారం-17సీ తమ వద్ద ఉంచుకోవాలి. ఎందుకంటే ఎక్కడైనా అవకతవకలు జరిగి ఉంటే ఫారం-17సీ ద్వారా ఇట్టే తెలిసి పోతుంది. పోలింగ్‌రోజు ప్రిసైడింగ్ అధికారి, రాజకీయ పార్టీల ఏజెంట్లు చేసిన సంతకాలు ఇందులో ఉంటాయి. ఏజెంట్ల సంతకాలు లేకపోతే ఏవో అవకతవకలు జరిగాయని భావించాలి. సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఉపయోగించిన కంట్రోల్ యూనిట్ నంబరును ఈ ఫారంలో పొందుపరిచి ఉంటారు. కౌంటింగ్ సమయంలో అదే నంబరు కంట్రోల్ యూనిట్‌పై ఉందో, లేదో ఏజెంట్లు సరిచూసుకోవాలి. పోలింగ్‌రోజున ఎక్కడైనా.. ఏదైనా సమస్య ఉత్పన్నమై ఉంటే కంట్రోల్ యూనిట్‌ను మార్పు చేసి ఉంటారు. ఆ విషయాన్ని పేర్కొంటూ మార్పు చేసిన కంట్రోల్ యూనిట్ నంబరును ఫారం-17సీలో చూపుతారు. కౌంటింగ్‌లో ఆ నంబరు మ్యాచ్ కాకపోతే వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలి. పోలింగ్ రోజు నమోదైన ఓట్ల సంఖ్య ఫారం-17సీలో ఉంటుంది. కౌంటింగ్‌లో కంట్రోల్ యూనిట్‌లో చూపుతున్న ఓట్ల సంఖ్య, ఫారం-17సీలో నమోదు చేసి ఓట్ల సంఖ్య సమానంగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించిన తర్వాత ఈవీఎంలో నమోదైన ఓట్లను సీఆర్‌సీ(క్లోజ్ రిజల్ట్ క్లియర్) చేసిన తర్వాత పోలింగ్‌ను ప్రారంభించాలి. సీఆర్‌సీ చేయని సందర్భంలో మాక్ పోల్‌లో నమోదైన ఓట్లను వీవీ ప్యాట్ నుంచి వేరుచేసి సీల్డ్ కవరులో ఉంచిన వాటిని లెక్కించాలి. కంట్రోల్ యూనిట్‌ను వాస్తవంగా పోలైన గ్రాస్ ఓట్ల నుంచి తీసివేయగా వచ్చిన ఓట్లను నికర ఓట్లుగా పరిగణించాలి. కంట్రోల్ యూనిట్‌పై ఉన్న అన్ని సీళ్లను ఫారం-17సీలో ఉన్న నంబర్లతో సరిచూసుకోవాలి. మిషన్‌పై సీళ్లు ఏవైనా చిరిగి ఉన్నాయా? సరిగ్గా ఉన్నాయా? అనే విషయాన్ని కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా చూసుకోవాలి. కంట్రోల్ యూనిట్ పైన ఉండే అన్ని సీళ్లపైన ఏజెంట్, అధికారుల సంతకాలు ఉంటాయి. అవి సక్రమంగా ఉన్నాయో? లేదో? ఏజెంట్లు చూసుకోవాలి. అనుమానం వస్తే నివృత్తి చేసుకున్నాకే కౌంటింగ్ ప్రారంభించాలి. రిజల్ట్ బటన్ నొక్కిన తర్వాత నో టాతో కలిపి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య చూపుతుంది. నమోదైన ఓట్లు, 17సీలో ఉన్న ఓట్లు సమానంగా ఉండాలి. పోలింగ్ తేదీ, పోలింగ్ ప్రారంభం, ము గింపు సమయం, గంటలు, సెకండ్లతోసహా కంట్రోల్ యూనిట్ చూపుతుంది. దాన్ని ఏజెంట్లు సరిచూసుకోవాలి.

పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు

రాయచోటి: కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సూచించారు. రాయచోటిలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాలలోని ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ కౌంటింగ్‌లో సమస్యలు తలెత్తకుండా ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో భారీ కేడింగ్ పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కౌటింగ్ హాల్‌లో 14 టేబుల్స్ ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ప్రతి టేబుల్‌కు ఒక ఏఆర్ఓ, ఒక సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఈవీఎం కౌంటింగ్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారన్నారు. ఇందులో ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. అధికారులు, సిబ్బంది ఉదయం 5 గంటలకు కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి రిటర్నింగ్ అధికారికి రిపోర్టు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



రిట్నరింగ్ అధికారులు, డీఎస్పీలతో ఎస్పీ కృష్ణారావుతో కలిసి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఎన్నికల కౌంటింగ్‌లో ఎలాంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ హెచ్చరించారు. అన్నమయ్య జిల్లాలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతి భద్రతల పరిరక్షణపై రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలతో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జూన్ 4వ తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మందిపై బైండోవర్ కేసులు విధించారు, రౌడీ షీటర్లపై ఎలాంటి చర్యలు చేపట్టారు తదితర అంశాలపై డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌడీ షీటర్లపై బైండోవర్ కేసులు విధించి ఎక్కడా హింసాత్మక చర్యలు జరగకుండా ముందస్తు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎగ్జిట్ పోల్ వెలువడనున్న నేపథ్యంలో అక్కడక్కడా గొడవలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండి శాంతిభద్రతలను కాపాడాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు అమలవుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రాళ్లు, రప్పలు, కర్రలు లాంటి ఇతరలకు హాని కలిగించేవి 133 సెక్షన్ కింద ఎవరూ పట్టుకోకూడదన్నారు. ఫైర్ క్రాకర్స్‌ను పూర్తిగా నిషేధించాలని, అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోల్ బంకులలో డీజిల్, పెట్రోల్, బాటిళ్లకు పట్టకుండా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్ఓలు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లాలో రెండు మూడు రోజుల నుంచి ఎండల తీవ్రత పెరిగింది. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే శనివారం సాయంత్ర 6 గంటల ప్రాంతంలో ఉన్నట్లుండి ఒక్కసారి అకాశమంతా మేఘావృతమైంది. కొద్దిసేపటికే ఉరుములతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు వాన రాకతో కాసింత ఉపశమనం పొందారు.

గండిక్షేత్రం.. భక్తజన సందోహం





ప్రత్యేక అలంకరణలో స్వామివారు, భక్తులతో నిండిన క్యూలైన్లు



చక్రాయపేట మండలంలో హనుమాన్ శోభాయాత్ర

చక్రాయపేట: హనుమజ్జయంతి సందర్భంగా శనివారం గండి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.అంజన్న బాలాలయాన్ని కూడా ప్రత్యేకంగా అలంకరించారు.ఉదయం నుంచి కూడా ఆలయంలోని క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి.భక్తులు అంజన్న జెండాలు చేత పట్టుకుని జైశ్రీరాం నినాదంతో హోరెత్తించారు. ఈఏడాది స్వామివారి అభిషేకాన్ని భక్తులందరికీ కనిపించేలా నిర్వహించారు.అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- నాలుగు రోజులుగా జరిగిన హనుమజ్జయంతి వేడుకలు శనివారం ముగిశాయి.ఆలయ ప్రాంగణంలో త్రికాల ఆరాధన, పంచ సూక్త హోమం, ఆంజనేయ స్వామి మూల మంత్ర హోమం, సుదర్శన హోమం మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.
- జిల్లాలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చక్రాయపేటలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరాం నినాదాలు చేస్తూ భక్తులు యాత్రలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం లారీ బోల్తా



బోల్తా పడిన మద్యం లారీ

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి రహదారి లోని గువ్వల చెరువు రోడ్డు నాలుగో మలుపు వద్ద మద్యం సీసాలు తీసుకువస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు నుంచి నంద్యాలకు ఆఫీసర్ ఛాయిస్ అనే బ్రాండ్ లోడుతో వెళ్తున్న లారీకి ఎదురుగా కారు, బస్సు అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. సీకేదిన్నె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే ఆరు కేసుల మద్యం సీసాలు తీసుకుని స్థానికులు పరారైనట్లు తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సీసాలు తెసుకెళ్లిన వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి



సంబేపల్లె : మండలంలోని బోయనపల్లె సమీపంలోని ప్రాథమిక పాఠశాల సమీపాన శనివారం గుర్తు తెలియని వృద్ధురాలు(65) మృతి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గత నాలుగు రోజులుగా ఓ వృద్ధురాలు మతి స్థిమితం లేకుండా బోయనపల్లె సమీపంలో ఉంటోందని, ఈ క్రమంలోనే గ్రామస్థులు ఆమెకు భోజనం పెడుతున్నట్లు తెలిపారు. శనివారం ఆమె మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని సంఘటనా స్థల్నాని పరిశీలించి రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు ఎర్రటి జాకెట్, ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ కలర్ చీర, చేతికి రెండు ఉంగరాలు ధరించి ఉంది.

పశు బీమా.. పాడి రైతు ధీమా

వైఎస్సార్ పశు బీమా పథకం ప్రభుత్వం పశు పోషకులకు అండగా నిలుస్తోంది. రైతు కేవలం 20 శాతం ప్రీమియం మొత్తం చెల్లిస్తే చాలు, మిగిలిన 80 శాతం ప్రభుత్వమే భరిస్తుంది. ఇతర రైతులకు అమ్మినా ఆ వివరాలు ఏడు రోజుల్లోగా తెలియజేస్తే, పాలసీని కొత్త యజమానికి వర్తింపజేస్తారు. పశువు మరణించిన 21 రోజుల్లో లబ్ధిదారుల ఖాతాకు నగదు చేరుతుంది. ఆ వివరాలు పాడి రైతుల కోసం...

- రైతు వాటా 20శాతం... ప్రభుత్వం వాటా 80 శాతం
- అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రగుంట్ల : వేల రూపాయలతో కొనుగోలు చేసిన పాడి పశువులు అకారణంగా మృతి చెందడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది తెలుసుకున్న ప్రభుత్వం వారికి అండగా నిలిచి వైఎస్సార్ పశు బీమా పథకం అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా కొంత ప్రీమియం చెల్లిస్తే చాలు.. పశు మరణానంతరం నగదు ఖాతాకు చేరుతుంది. దేశవాళీ, సంకర జాతికి చెందిన ఆడ, మగ పశువు మృతిచెందితే రూ.30 వేలు , నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు, గొర్రెలు మేకలు, పందులు రూ.6 వేల వరకు అందిస్తారు. ఇస్తున్నారు. ప్రభుత్వ నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కువ మొత్తానికి బీమా చేయించుకోవాలంటే గేదెలు, ఆవులకు 6.4శాతం, గొర్రెలు మేకలు, పందులకు 6 శాతం చొప్పున పూర్తి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. గేదెలు, ఆవుల్లో గరిష్ఠంగా రూ.1.20 లక్షలు, గొర్రెలు, మేకలు, పందుల్లో రూ.50 వేల వరకూ బీమా సదుపాయం ఉంటుంది. పరిహారానికి ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలి.

ప్రీమియం చెల్లింపు ఇలా...

దేశీయ, సంకరజాతి ఆవులకు ప్రీమియం మొత్తం రూ.30 వేలు. ఎస్సీ, ఎస్టీలతో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన వ్యక్తులు మూడు సంవత్సరాలకు గానూ రూ.384, మిగిలిన రైతులు రూ.960 చెల్లించాలి. నాటు జాతి ఆవులు , గేదెలకు ప్రీమియం మొత్తం రూ.15 వేలు కాగా.. ఎస్సీ, ఎస్టీలతో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు 3 సంవత్సరాలకు గానూ రూ.192, మిగిలిన రైతులు రూ.480 కట్టాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి ఎస్సీ, ఎస్టీ తెల్లరేషన్ కార్డుదారులు రూ.36, ఇతరులు రూ.90 చెల్లించాలి. రెండేళ్లకైతే రూ.54. ఇతరులు రూ.135, మూడేళ్లకైతే రూ.75, ఇతరులు రూ.187 చొప్పున ప్రీమియి చెల్లించాలి.

రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు..

పశు బీమా సదుపాయం కోసం రైతులు తమ సమీపంలో ఉన్న పశువైద్య శాలలు, రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వివరాలను నమోదు చేసుకొని తమ వాటా ప్రీమియం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడాదిలో గరిష్ఠంగా ఐదు పశువులకు గొర్రెలు, మేకలు, పందులు అయితే 50 జీవాలకు మాత్రమే బీమా అర్హత ఉంటుంది. 2–10 సంవత్సరాల వయస్సు కల్గి ఒక్కసారైనా ఈనిన గేదెలు, ఆవులకు, అన్ని వయస్సు గల మగ పశువులకు 6 నెలల వయస్సు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు బీమా పథకం వర్తిస్తుంది.

21 రోజుల్లోనే పరిహారం



పశువు మరణించిన 21 రోజుల్లోనే బీమా పథకం కింద లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాకు మొత్తం జమవుతుంది. పాడి రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకోవాలి. పశువు విలువను బట్టి ఈ బీమా మొత్తం ఉంటుంది. ఆర్‌బీకేల్లో ఉండే సిబ్బంది, గోపాలమిత్ర ద్వారా పాడి రైతులు అవసరమైన సేవలు పొందవచ్చు.

– డాక్టరు మునెయ్య, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, ఎర్రగుంట్ల

దాడులను అడ్డుకుంటే జిల్లా బహిష్కరణ చేస్తారా?

ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్



కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేయస్సు కోసం పని చేస్తూ, టీడీపీ నాయకుల దాడులను అడ్డుకున్నందుకు పోలీసు అధికారులు జిల్లా బహిష్కరణ చేయడం దారుణమని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ఘర్షణకు పాల్పడ్డానంటూ రౌడీ షీట్ ఓపెన్ చేసిన పోలీసులు, నేడు జిల్లా బహిష్కరణ చేస్తున్నట్లు ప్రకటించడం అన్యాయమన్నారు. ఏదైనా సమస్య సృష్టిస్తారని అనుమానముంటే గృహ నిర్బంధం చేయడం, పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం చేయాలిగానీ ఇలా జిల్లా బహిష్కరణ చేయడం వింతగా ఉందన్నారు. జగనన్న కోసం తన ప్రాణాలైనా ఇస్తానని, దేశ బహిష్కరణ చేసినా భయపడేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

అనంత, కర్నూలు జట్ల హోరాహోరీ



కరణ్ షిండే (135 పరుగులు)



గిరినాథ్‌రెడ్డి (113 పరుగులు)



రాజుకుల్లాయప్ప (100 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి– ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో శనివారం నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 243 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కె.ఎస్.పృథ్వీరాజ్ 83 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 67 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 41 ఓవర్లలోనే 6 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జట్టులోని నిఖిలేష్ 85 బంతుల్లో 15 ఫోర్లతో 88 పరుగులతో రాణించాడు.

అనంత జట్టు విజయం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన అనంతపురం, కర్నూలు మ్యాచ్ హోరా హోరీగా సాగింది. ఈ మ్యాచ్‌లో మూడు సెంచరీలతో క్రీడాకారులు చెలరేగడంతో రసవత్తరంగా సాగింది. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 369 పరుగులు చేసింది. జట్టులో గిరినాథ్‌రెడ్డి 67 బంతుల్లో 5 ఫోర్లు, 11 సిక్సర్లతో 113, రాజుకుల్లాయప్ప 118 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 100 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 49.2 ఓవర్లలో 362 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ఈ జట్టులో కరణ్‌షిండే 110 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్సర్‌తో 135 పరుగులు, సంజయ్‌నాయుడు 81 పరుగులతో 9 ఫోర్లు, 1 సిక్సర్‌తో 72 పరుగులు చేశారు. అనంత బౌలర్ సంతోష్ 4 వికెట్లు తీశాడు. అనంతపురం జట్టు 7 పరుగుల తేడాతో విజయం సాధించింది.

మహిళ మృతి



చికిత్స పొందుతూ మృతిచెందిన పరిమళ

మదనపల్లె : ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఈ నెల 29న మదనపల్లె రామగోపాల్ నాయుడు వీధిలో నివాసముంటున్న పరిమళ, బసినికొండకు చెందిన షేక్ ముబారక్ ఆటో బాడుగకు తీసుకుని తరిగొండకు వెళ్లి మదనపల్లెకు తిరిగి వస్తున్నారు. 5వ మైలు పెట్రోల్ బంకు సమీపంలో డ్రైవర్ ఆటో వేగాన్ని నియంత్రించలేకపోవడంతో బోల్తా పడి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పరిమళపై ఆటో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంలో వస్తున్న వాల్మీకిపురానికి చెందిన బావాజాన్(39), అతడి భార్య అఫ్రిన్, కుమార్తె సుఫియాఅంజుమ్(15)లు గాయపడ్డారు. బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిమళ పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మదనపల్లె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఈబీ ఎస్సై వి.జి.రాముడు సీజ్ చేశారు. ఇసుక తరలిస్తున్న చుక్కల తండాకు చెందిన రాజానాయక్, కోళ్లబైలు పంచాయతీ బాబూ కాలనీకి చెందిన వినోద్‌కుమార్, వేంపల్లె పంచాయతీ నల్లగుట్లపల్లెకు చెందిన సతీష్, గంగులప్ప, చిప్పిలికి చెందిన నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. అంకిశెట్టిపల్లె పంచాయతీ చిప్పిలి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.

జోస్ ఆలుక్కాస్ సేవాగుణం అభినందనీయం

- 100 రోజుల వేడుక సందర్భంగా సేవా కార్యక్రమాలు
- 4 జెడ్పీహైస్కూళ్లు, ఒక చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.11 లక్షలు



ప్రధానోపాధ్యాయురాలు పుణ్యవతికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎండీ జాన్ తదితరులు

మదనపల్లె : సమాజానికి తమ వంతు సేవ చేయాలనే లక్ష్యంతో పట్టణంలో విద్యాభివృద్ధికి, జోస్ ఆలుక్కాస్ యాజమాన్యం సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. మదనపల్లె పట్టణంలోని జోస్ ఆలుక్కాస్ వంద రోజుల వేడుక సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషాను జోస్ ఆలుక్కాస్ ఎండీ జాన్ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం పట్టణంలోని జెడ్పీ, నెహ్రూ మున్సిపల్, హోప్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపల్ కూరపర్తి సాయి చైతన్య ప్రవంతి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పద్మనాభరెడ్డికి సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ.11 లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎండీ జాన్ అందజేశారు. పట్టణంలో ట్రాఫిక్ బ్యారికేడ్ల ఏర్పాటుకు పోలీసుశాఖకు లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. నవాజ్‌బాషా మాట్లాడుతూ.. జోస్ ఆలుక్కాస్ యాజమాన్యం పట్టణంలో వ్యాపార సంస్థను స్థాపించి, యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. జోస్ ఆలుక్కాస్ ఎండీ జాన్ మాట్లాడుతూ..సమాజసేవలో భాగంగా ప్రతి ఏడాది రూ.10కోట్ల మేర సేవాకార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో వాటిని మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జోస్ ఆలుక్కాస్ పీఆర్ఓ రంజిత్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు సదాశివరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీలో రక్తదాన శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ వార్షికోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమ బ్యాంకు వ్యాపార నిర్వహణలో ఇతర బ్యాంకుల కంటే ప్రగతి పథంలో ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విరివిగా రక్తదానం చేయాలని ఖాతాదారులను కోరారు. 70 సార్లకు పైగా రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డిని అభినందించారు. రీజినల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, ప్రధాన, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టానికి తూట్లు



మాట్లాడుతున్న జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు

జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు యాదవ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అక్షరాలపై లక్షల రూపాయల వ్యాపారం చేస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని జీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని జీఆర్‌వైఎఫ్ కార్యాలయంలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేసిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే అడ్మిషన్లు పూర్తయ్యాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఫీజులను నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్నారు. డిస్ట్రిక్ ఫీ రెగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోకుండా ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారన్నారు. ఎల్‌కెజీ విద్యార్థికి రూ.31,000 ఫీజును తీసుకుంటున్నారన్నారు. ఈ నెల 6న డీఈఓ, 8న ఆర్ఐఓ, 10న ఆర్జేడీ, 12న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బాబు, ఏటూరు లోకేష్, ధారా గోపి, సిపి.నాగేంద్ర, ఎం.సూర్యవంశీయాదవ్, కె.భాస్కర్, పవన్ కుమార్, సురేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు రాయితీపై అందించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వ్యవసాయ సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయాధికారులు స్పందించాలని, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు, జీలుగ, ఇతర విత్తన కాయలు రాయితీపై అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆర్బీకే కేంద్రాల ద్వారా అందించేందుకు విత్తనకాయలు సిద్ధం చేయాలని సూచించారు. మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు రుణాలు రైతులకు అందించాలన్నారు. కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో రైతులను చైతన్య పరిచి సమస్యలు పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకట సుబ్బయ్య, చిన్నసిద్దయ్య, రామచంద్రారెడ్డి, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు

జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) లోసారి సుధాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లోసారి సుధాకర్

కడప అర్బన్ : ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సమయంలో సామాజిక మాధ్యమాలు వేదికగా అసత్య ప్రచారాలకు పాల్పడితే సహించేది లేదని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) లోసారి సుధాకర్ హెచ్చరించారు. జిల్లాలో ప్రస్తుతం 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నాయన్నారు. నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున సిరికిరెడ్డి ప్రసాదరెడ్డి అనే వ్యక్తికి చెందిన (ఏపి04 ఏహెచ్ 2575) మోటార్ సైకిల్ మంటల్లో చిక్కుకుని కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు. ఎవరైనా కక్షపూరితంగా, ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారా? అనే అంశంపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ సంఘటనపై అసత్య ప్రచారాలు చేస్తూ, కక్ష పూరితంగా తగలబెట్టారని సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తున్నారన్నారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ఇలాంటి చర్యలను మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్, చిన్నచౌక్ సీఐ పి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

– ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు



ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని కార్పొరేట్ విద్యా సంస్థలు ఇంటర్ విద్యను ఖరీదైన విద్యగా మారుస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు అన్నారు. కడప నగరం లోని ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి విద్యార్థుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వలరాజు మాట్లాడుతూ అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకపోయినా, విద్యార్థుల తల్లి దండ్రుల వద్ద నీట్, జెఈ మెయిన్స్, ఎలైట్, ఎయిమ్స్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు పాతర వేసి, అర్హత కలిగిన అధ్యాపకులను ఏర్పాటుచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పాఠ్య పుస్తకాల పేరుతో రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కె.శివశంకర్, శివ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాము కాటు



చికిత్స పొందుతున్న ఉపాధి కూలీ

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల కేంద్రంలో ఓ ఉపాధి కూలీ శనివారం పాముకాటుకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గురిజాల వద్ద పీబీసీ తొండూరు డిస్ట్రిబ్యూటరీ లైనింగ్ కాల్వలో జమ్ము గడ్డి పెరిగి చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం లేదు. ఇటీవల ఉపాధి కూలీలు జమ్ముగడ్డి తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో ఉపాధి కూలీ రాజశేఖర్‌రెడ్డిని గడ్డిలో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే రాజశేఖర్‌రెడ్డిని పులివెందుల ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్య చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది.

ఈసెట్ ఫలితాల్లో ప్రతిభ



109వ ర్యాంకు సాధించిన లీలాకుమారి



183వ ర్యాంకు సాధించిన జాహ్నవి

కడప ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ నుంచి ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరాల ప్రవేశం కోసం ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఈసెట్–2024 ఫలితాల్లో కడప జిల్లా రామంజనేయపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఈఈఈ) విభాగానికి చెందిన ఎం.లీలాకుమారి 109, యు.జాహ్నవి 183వ ర్యాంకు సాధించారు. ప్రిన్సిపల్ సీహెచ్.జ్యోతి, ఎలక్ట్రికల్ హెచ్ఓడీ దామోదరం, సిబ్బంది వారిని అభినందించారు.

ఇంక్రిమెంట్లు నిలిపివేయాలనడం అన్యాయం

– యూటీఎఫ్ కార్యదర్శి లక్ష్మీ రాజా



ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనని ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు నిలిపివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. పాఠశాల విద్య ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్ కుమార్‌కు శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా జరగటానికి ఉపాధ్యాయులంతా సమష్టిగా పనిచేశారన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించిన రెమ్యూనరేషన్ తేడాలపై అధికారులు స్పందించలేదన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి పిల్లల ఆరోగ్య పరిస్థితుల కారణంగా హాజరుకాలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు సుబ్బారావు, వీరనారాయణ, విశ్వనాథ్, గంగన్న పాల్గొన్నారు.

యర్రగుంట్ల వాసికి ఏపీసీఈఐ పురస్కారం



ఎర్రగుంట్ల : ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ(ఏపీసీఈఐ) పురస్కారం యర్రగుంట్లకు చెందిన టీచర్ సుజనకుమార్ దరియా అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఈవెంట్ మేనేజర్స్ డే సందర్భంగా ఈ అవార్డును ఆయనకు అందజేశారు. సుజన్‌కుమార్ యాంకర్‌గా, మెజీషియన్‌గా, టీచర్‌గా, ఈవెంట్ మేనేజర్‌గా అందించిన సేవలకు ఈ పురస్కారం దక్కింది.